# తగిన సమంధం

రైలుబండికీ మానవ జీవితానికీ పోలిక లెక్కువ. ఎక్కేవాళ్లని ఎక్కనివ్వరు దిగేవాళ్లు. దిగేవాళ్లని దిగనివ్వరు ఎక్కేవాళ్లు. ఒకరి నొకరు అటకాయించుకొంటారు. రైలుబండిలో స్థిమితంగా కూర్చున్న వాళ్లకి రైలులో జొరబడాలని చూచేవాళ్లంతా గర్భశత్రువులు. ఎట్లాగో దూసుకువచ్చి సీట్లో కూల బడిం తర్వాత ఆప్తమిత్రులు.

అది మాంచి లగ్గసరి. కాకినాడ రైల్వేస్టేషన్ కిటకిట లాడిపోతోంది. రాఘవయ్యగారూ, భార్య రాజ్యలక్ష్మమ్మ, కూతురు మణిమేఖలా కాకినాడలో వేలువిడిచిన మేనమామ యింట్లో పెళ్లికని వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు ఏలూరు. రాజ్యలక్ష్మమ్మ ముందు రైలెక్కింది. 'అబ్బ-ఏమి ఇరకాటమండీ-పెళ్లివారంతా యీ పెట్టెలోనే ఎక్కారల్లే వుంది' అని ఉస్సురుమన్నది. రాఘవయ్యగారు పెట్టెలోవున్న ఓ యువకుడికి బెడ్డింగు లక్షణంగా అందించి తనూ జొరబడ్డాడు. అంతా సర్దుకుని కూచున్నారు. మణి నిలబడిపోయింది. 'అమ్మాయీ నీకు స్థలం దొరకలే?' అని రాఘవయ్యగారు అజమాయిషీ చేస్తున్నంతలో ఇట్లా కూచోమనండిసార్. నేను స్టేషన్ స్టేషన్‌కీ దిగాలి లెండి – దిగి మధ్యమధ్య ప్లాట్‌ఫారం గాలి పీలుస్తూపోతేనేగాని కాలక్షేపం కాదు' అని బెడ్డింగు అందుకున్న యువకుడు ఖాళీ చేసాడు. 'ఒద్దు నాయనా వొద్దు – ఇంకానయం – సామానందుకుని చోటు చేసింది చాలక – ఎక్కడికి నాయనా నువ్వు? ఎవరబ్బాయివమ్మా? బుద్ధిమంతుడల్లే వున్నావు – చదువుకున్న వాళ్లలో ఇంత విధానం చూడలేదింతవరకూ' అని రాఘవయ్యగారు కళ్లపైన అరచెయ్యి పెట్టుకుని, అతనివంక పరకాయించి చూచి ఇష్టంగా నవ్వుతోనే అమ్మాయిని కూచోమని సన్న చేసాడు 'రాజమండ్రి టెన్నిస్ టోర్నమెంట్లకి వెడుతున్నాలెండి. తమరిక స్థిమిత పడినట్టేనా?' అని పరామర్శించి, తనకి బదులు తన 'రాకెట్' వదిలి చక్కాబోయాడు యువకుడు.

రైలు కదిలింది.

రాజ్యలక్ష్మమ్మ ఆలోచనలో పడింది. ఈపెళ్లికెందుకు వచ్చినట్లో ఆమెకయోమయంగా వుంది. కేవలం ఈ పెళ్లికనే తాము తర్లిరాలేదని పెనిమిటి మొదట్లో చెప్పనే చెప్పాడు. మణికి సంబంధాలు చూస్తున్న భోగట్టాలో, ఆమధ్య కాకినాడలో ఓ రిటైరయిన తాసిల్దారుగారబ్బాయి

వున్నాడనీ, బోలెడాస్తి వున్నదనీ, ఏమేమో ఊరిస్తూ చెప్పుకుంటూ వచ్చాడు పెనిమిటి. కాకినాడవచ్చి మూడు రోజులయింది. ఇక్కడ వున్నంతసేపూ అదేమిటో పట్టించుకున్నట్టే అవుపడలేదాయన. ఇప్పుడు చట్టున స్ఫురణకి వచ్చిందామెకి. ఎన్ని సమంధాలు ఎన్ని సమంధాలు... అమ్మాయి కొన్నింటిని తోసిరాజనా, ఆయన కొన్నింటిని కొట్టిపారేయనూ... ఓ పట్టాన్ని ముడిపడనిస్తేనా? ఒక్కగానొక్క సంతానం.

సామర్లకోటలో రైలాగింది. పెళ్లివారంతా బిలబిలలాడుతో దిగిపోయారు. పెట్టె ఖాళీ అయింది. 'బుక్‌స్టాల్'లో 'డెయిలీ' కొని లోపల కొస్తున్నాడు 'బెడ్డింగ'ందుకున్న యువకుడు. అప్పటికిగాని అతనికి కూచుందుకు ఆస్కారం లేకపోయింది పాపం. ఎదురు 'బెంచీ'మీద 'పేపరు' బార్లా తెరిచి ఆ పేజీలో మునిగిపోయాడు తక్షణం.

రాజ్యలక్ష్మమ్మ ఇక అందుకుంది.

"ఏమండీ ఎవరో 'తాసిల్దారు'గారబ్బాయనీ, 'యం.యస్.సి' చదువుతున్నాడనీ అంటిరి – పోనీ కుర్రవాడినైనా చూడకపోతిరి – అమ్మాయికి చూపించకనూ పోతిరి."

రాఘవయ్యగారు మణివంక ఒక్కసారి అర్థవంతంగా చూచి మౌనంగా ఊరుకున్నాడు.

"చట్ – ఆ పెళ్లి నాకక్ఖర్లేదమ్మా" అని ఒక్క గరిగమ్మ పెటుక్కున విరిచింది మణికుమారి.

ఇదేమిటి? విస్తుపోయింది రాజ్యలక్ష్మమ్మ. అంటే ఏదో గ్రంథం కొంత నడిచిందన్నమాట తనకి తెలియదు మరి. అప్పుడే ఆ తండ్రి దరియాప్తు చెయ్యా, ముద్దుల కూతురికి వివరించా, అమ్మాయిగారపుడే ఒక నిర్ణయానికి రివ్వున దూకనూ ఆ నిర్ణయం తుది నిర్ణయంగా ఫైసలయి పోనూ – అంతా జరిగిపోయిందన్నమాట. తనతో లాంఛనప్రాయంగానయినా సమాలోచన, సంప్రతింపూ, చట్టుబండలూ ఏనాడు అవసరమయినాయి గనుక ఆ తండ్రీ కూతుళ్లకి.

మణిమేఖల ఏలూరులో సెంట్‌థెరిసా కాలేజీలో బి.యెస్.సి. చదువుతున్నది. పద్దెనిమిది వసంతాల నిగ్గు తొణికిసలాడుతున్న ముఖవర్చస్సు, చూపులో ఒక కళ్లెం–మాటలో ఒక ధిక్కారం.

"ఆ తాసిల్దారు లంచాలుపట్టి 'డిస్‌మిస్' అయినాట్ట మొన్న మొన్ననే–వెధవ చట్కారీ సమంధం" అని కుండబద్దలుకొట్టింది మణి. ఇక తాపీగా "సాహితి" చదువుకుంటూ కూచున్నదామె – మరి ఆ సమంధం విషయమైన ప్రసక్తి అనవసరమూ, అనుచితమూ అన్న ధోరణిలో. అర్థమ యింది రాజ్యలక్ష్మమ్మకి. "మరి ఈ సమంధం కోసమని నాలుగు నెలల నించీ గుటకలు మింగు తున్నారాయెను మీరు." అని ఎర్రగా చూచింది పెనిమిటివంక. "అప్పటికి డిస్‌మిస్ కాలేదు" అని తేల్చిపారేశాడాయన. రాఘవయ్యగారికి కూతురంటే భయం, భార్యంటే లోకువ. కాని తమాషా. కూతురికి భయపడుతున్నట్టు అవుపించదు. బి.యస్.సి. చదువుకుంటున్నదాయెను. కాలేజీలో మణిపూస అనిపించుకుంటున్నది కూడా. ఆమెతో వ్యతిరేకించడం దుర్ఘటమే మరి. ఆమెతో చర్చకి దిగినట్టే దిగి, ఏ సమంధాన్ని గూర్చి అయినా సత్సంప్రదాయాలూ, దుస్సంప్ర దాయాలూ, ఆదర్శాలూ, అభ్యంతరాలూ ఆమెతోపాటు తనూ, ఎడాపెడా, అకుకి అందనివీ,

పోకకి పొందనివీ విలువలు చీల్చి చెండాడి, ఆచి తూచి కొసకి ఆమెపలికే నిర్ణయంతో ఐక్యమై చక్కా వూరుకోడం ఆయనకి పరిపాటి.

కాకపోతేమటుకు? లంచాలు తెగ గుంజుతాడని మీరే చెబితిరి - లేకపోతే లక్షాయాభైవేలు కూడబెట్టగలడాయేఁ?" అని నిగ్గతీసింది రాజ్యలక్ష్మమ్మ. "అబ్బ ఇప్పుడు డిస్‌మిస్సయి పోయినా దుగా? తలవంపులు కాదూ డబ్బుందిగా అని ఎగబడితే?" అని మరచెంబులో నీళ్లు తెగ తాగేస్తున్నాడాయన. ఇరుకుసందులలోకి నెట్టేస్తుందావిడ. 'సరిపోయింది' అనుకున్నది మణి. దొరికితే దొంగా, లేకుంటే దొరా అన్నమాట. నాన్నగారికి ఈ తాసీల్దారు పుట్టుపూర్వోత్తరాలు క్షుణ్ణంగా ఇదివరకే గ్రాహ్యమై వున్నాయన్నమాట. దానితో చర్రుమంది. "నువ్వు మాటి మాటికీ కలగజేసుకోవాకమ్మా - నాకా సమంధం అఖ్ఖర్లేదంటే అఖ్ఖర్లేదు - ఇంకా చూసేదేమిటి నా మొఖం" అని ముదలకించింది మణి. "ఓయబ్బో ఇట్లాంటివి చాలా ఎరుగుదుం - మీనాన్నారు మహబుద్ధిమంతులుగావును - ఆనాడు కంట్రోలు రోజుల్లో పంచదార బస్తాలు చాటుగా-" అంటించాలని చూసింది గాని రాజ్యలక్ష్మమ్మ, రాఘవయ్యగారు చట్టన తుంచేసారు సంభాషణ. గోదావరి స్టేషను వచ్చేసింది, రైలాగినట్టుంది - నాలుగు బిస్కట్లూ ఓ అరకప్పు టీ తీసుకొస్తూ మాతల్లి మాతల్లి" అని జిలిబిలిగా బ్రతిమలాడి పంపివేశాడు మణికుమారిని. సంభాషణలు చాలా ప్రమాదకరమైన వేపుకి కొనసాగుతున్నట్టు పసికట్టాడాయన. మణిముందు అట్లా దొరికి పోవడం చిన్నతనమనిపించిందాయనకి. ఒక్క క్షణం ఆమెని సంభాషణనించి మినహాయించడం మంచిది అనుకున్నాడు. బెడ్డింగందుకున్న యువకుడూ రైలు దిగాడు. రాఘవయ్యగారి చేతిలో చాలా వ్యాపారాలు నలుగుతున్నాయి. పరిమిట్లు, లైసన్సులు, ట్రంక్ టెలిఫోన్లమీద వ్యాపారం అందులోవున్న సాధకబాధకాలు, మలుపులు, మెలికలు, మడతలు ఇవన్నీ ఆడంగుల దగ్గర చర్చకు రావడం ఆయనకి చిరాకు.

ప్లాట్‌ఫారం కలకలలాడుతున్నది. 'డిసెంబర్ల' కదంబ మొకటి కొని "స్పెన్సర్" ఎట్లా అని చూస్తూ నడుస్తున్నది మణికుమారి. "ఇట్లా రండి - ఇట్లా రండి. 'రెస్టారెంట్' ఇటూ - నేనూ అక్కడికే పోతున్నా" అని పిలుస్తున్నాడు యువకుడు. మణికుమారి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూచింది. సిగ్గు తెరల పొరలలోనించి. మీరా? చాలాసేపు ట్రెయిన్లో నిలబెట్టాము మిమ్మల్ని అని క్షమాపణ పూర్వకంగా అంటూనే సర్దుకొన్నది. అతను కొంత చనువుగా తనని పిలవడం గమనింపుకి వచ్చింది చటుక్కున. ఆమెకి అనుభవమే, ఒక మొగ విద్యార్థినించి అపకారం పొందడంకన్నా ఉపకారం పొందడమన్నది చాలా ప్రమాదంతో కూడుకొన్న పని. ఆ వుపకారాన్ని ఒక పునాదిరాయిగా మార్చుకుని, దానిమీద గాలిమేడలు చకచకా కట్టడం ప్రారంభించే అమాయకులు అనుకున్నంతా అయింది.

"దానికేమి లెండి - మిమ్మల్ని ఎక్కడో చూచినట్టు జ్ఞాపకమండీ" అనికూడా నడుస్తూనే, కొంత నసుగుతూ, మాటలు కలిపే ధోరణిలోకి దిగాడతను. ఆమెకి నిజంగానే కోపం వచ్చింది. అందమైన అమ్మాయిని ఎట్లాగో ఒహలా సంభాషణలోకి దింపే మామూలు, అతి చవకబారు శిల్పాన్ని అప్పుడే తనమీద ప్రయోగించాలని చూస్తున్నాడీ యువకుడు. సీరియస్‌గా, 'అబద్ధం'

అని చక్కా ఊరుకుంది నోరుమూయిద్దామని. కాని అతను అంతటితో సరిపెట్టేలా లేదు. 'ఎక్కడచెపుమా', అని ఆలోచన కొనసాగిస్తూనే వున్నాడు పాపం. "ఏదో వొక నాటకంలో మీరు యాక్ట్ చెయ్యగా చూచినట్టు బీలగా గుర్తు నాకు.

"మళ్లీ అబద్ధం"

'ఇంకా వివరంగా చెప్పమంటారా?'

'ఎందుకులెండి శ్రమ'

"మొన్న 'ఏప్రిల్‌లో' 'సెంట్‌థెరిసా' కాలేజీలో పేరెంట్స్ డే నాడు వేసిన 'మర్చంట్ ఆఫ్ వెనిస్' డ్రామాలో 'పోర్షియా' వేసిన విద్యార్థిని నిజంగా అప్సరసే అయివుండాలనుకున్నాము మరి."

మణి తెల్లబోయింది. ఆనాడు ఆ నాటకంలో 'పోర్షియా' వేస్తా తనే. ఇందాకటినించీ అతన్ని పాపం నిష్కారణంగా అనుమానిస్తూ అవమానిస్తూ వస్తున్నది. దీనంగా అతనివంక చూస్తూ "క్షమించండి" అని తలవంచుకుంది. 'రెస్టారెంటు' చేరుకున్నారిద్దరూ. ప్లేట్లు చప్పుడవుతున్నాయి. 'చూస్తున్నాగా – ఏదో కాలేజీ కుర్రకుంకల కొంటెకోణంగి చేష్టలకింద నమోదయిపోతున్నాయి నా మాటలు" అని రెట్టించకనూ మానలేదతను. 'క్షమించమన్నా కదండీ?' అని డిమాండ్ చేసింది మణికుమారి.

బోయ్ – రెండు ద్రాక్షలు పట్రావోయ్ అని అర్డరిచ్చాడు యువకుడు. 'నాకు వద్దండీ వద్దు' అన్నదేకాని తప్పదని తెలుసు మణికి. తనని క్షమించినట్టు వాచ్యంగా చెప్పకుండా సర్దేస్తున్నాడు పాపం. ఇంకానయం, పెద్ద ఇరుకునపడ్డది అతి సీరియస్‌గా అతి గడుసుతనంగా వ్యవహరించాలనుకొని. బ్రతుకుజీవుడా అని, ద్రాక్ష 'సిప్' చేస్తూ మెదలకుండా ఊరుకున్నది.

"ఇహ నేనెవర్నో చెప్పాలనుకుంటాను" అన్నాడు యువకుడు. ఆమె నివ్వెరపోయింది. "మీరిందాకటినించీ చెప్పుకుంటున్నారు చూసారూ తాసిల్దారుగారబ్బాయిని."

ఆమె గుండె ఆగింది. తనని ఆశ్చర్యం తరవాత ఆశ్చర్యంలో ముంచడమే పనిగా పెట్టుకున్నాడేమి చెపుమా ఈ యువకుడు ఇంతవరకూ తనూ, తన తలిదండ్రులూ రైలులో ఇతనినిగూర్చీ, 'డిస్‌మిస్స'యిన ఇతని తండ్రినిగూర్చీ అవాకులూ చవాకులూ పేలుకుంటూ కూచున్నారు – ఇతని సమక్షంలో. అంతసేపూ మెదలకుండా కూచున్నాడు – ఏమీ ఎరగనట్టు – తమ మాటలు వింటున్న ధోరణీలేదు – తనని ఎప్పుడు చూచాడో – వెనకటి జ్ఞాపకాలు ఎంత సున్నితంగా గుర్తుకి తెచ్చుకుని తనని గర్తుపట్టగలిగాడో అంతుదొరకడం లేదు. ఇప్పటివరకూ రెండు క్షమాపణలయినాయి. మూడోసారి క్షమాపణ చెప్పవలసిన దుస్థితి విరుచుకుపడిందిప్పుడు; లాభం లేదు. కాని ఏమి చేస్తుంది?

"నిజంగా క్షమించండి... ఏమో అనుకున్నాం – మరో తాసిల్దారేమో" అని ఉక్కిరిబిక్కిరైపోయింది.

"ఖంగారు పడకండి. ముంచుకుపోయిందేమీ లేదులేండి. అంతా చాటునా మాటునా అనుకొంటున్నారు. నేను ఫలానా అని తెలియక నాయెదుటనే అనుకున్నారు మీరు. అంతే తేడా"

"మీ మనస్సుకి చాలా కష్టం కలిగించి వుంటాము బహుశా"

"కష్టమెందుకూ పైపెచ్చు? నమ్మరుగాని నాకూ మా నాన్నగారికీ అక్కడే వస్తుంది పేచీ"

"ఎక్కడ?"

"ఎట్లాగో ఒకలా సంపాదించాలిరా అంటాడాయన."

"మీరు?"

"అడుక్కుతినగూడదా అంటాను నేను"

"పెద్దలకున్న జబ్బే అది"

"వాళ్లు మాత్రం స్వార్థంగా, నీచంగా పోతారు"

"పిల్లల్ని మాత్రం ఉన్నతంగా ఉదారంగా పెంచాలని చూస్తారు"

"అదే వొచ్చిన అసిఘాత"

ఘణిల్లుమని రైలు కదిలింది. ఇద్దరూ చెల్లాచెదురుగా కదులుతున్న రైలుకేసి పరిగెత్తారు. "ఇది మన పెట్టె కాదండీ – మన పెట్టె కాదు" అని కేకలేసుకొంటూనే ఒక 'ఫస్టుక్లాస్ కంపార్ట్ మెంట్'లో జొరబడి చక్కా ఊరుకున్నారు. పెట్టె అంతా ఖాళీగావున్నది. ఎవ్వరూలేరు. బిక్కుబిక్కు మంటూ నిల్చున్నది మణి.

"ఫస్టుక్లాస్‌లా వున్నదే?"

"అబ్బ – ఏదో ఒక క్లాసు పోనిస్తురో నెక్స్ట్ స్టేషన్‌లో దిగిపోదాము లెండి. మంచి సదుపాయంగా వుంది కదండీ. కూచోండీ"

అతనికి ఏదో ధైర్యమెక్కువవుతున్నట్టు తట్టిందామెకి. పురుషుల్ని, అందునా, పడుచు విద్యార్థుల్ని అనుమానంగా చూచే అలవాటు నరాలలో జీర్ణించిపోయిన కుమారి మణిమేఖల ఉన్నట్టుండి అదార్తుగా 'ఒంటరిగా వున్నాను–ఇప్పుడు నన్ను పలకరించకండి దయచేసి' అనేసింది.

"అదేమిటి, నేనిక్కడ వుండగా ఒంటరిగా వున్నట్టు ఎట్లా ఊహించుకొంటారు."

"చాల్లెండి కవిత్వం"

"కవిత్వమా? కవినా నేను?"

"మీకే తెలియాలి?

"ఏమో మిమ్మల్ని చూడకక్రితం మాత్రం కాదు. ఒక ముఖ్యమైన మాట చెబుదామను కుంటున్నాను మీతో. అప్పుడే తెర దించేస్తున్నారు మనిద్దరిమధ్యా" ప్రాధేయపడుతున్నాడు పాప మతను.

"ఏమిటది?" ఆమె గుండె ఝల్లుమన్నది.

"మా నాన్న డిస్‌మిస్సయిన కారణం చెప్పలేదు మీకు" అంతేనా?

"చెప్పేదేముంది? లంచం పట్టినందుకు"

"ఆ లంచమిస్తా మీ నాన్నగారు"

మరో 'బాంబ్ షెల్'!

"నేను నమ్మను." కొంచె మాగింది. తన తండ్రి ఫలానా అని ఇతనికెట్లా తెలుసు? దొరి కాదనుకుంది.

"మీ నాన్నగారి పేరు మీ 'సూట్‌కేసు' మీద చూసా అని పూరించాడు యువకుడు. "డిటెక్టివ్ నవలలు క్షుణ్ణంగా చదివినట్టున్నాడు" అనుకుంది. కాని అంతలో గుక్క తిప్పుకొన్నది. తన తండ్రి అవసరమైతే లంచాలుగుప్పే రకమే. కాని ఈసారి క్షమాపణ అడుగదలచుకోలేదు.

"ఇస్తేమటుకు పుచ్చుకోవాలని ఎక్కడున్నదండీ" తనకే లాజిక్కు తెలుసుననుకుంటున్నాడు.

"మీ నాన్న మా నాన్నకి అయిదువదంలు లంచంపెట్టాడు. యాభైవేలు సంపాదించు కున్నాడు.

"ఎట్లా?" ఆమె కాశ్చర్యంగానే ఉంది.

"అప్పుడు మానాన్న గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసర్." మీ నాన్న దగ్గరనుంచి 'గవర్నమెంటు'కని 10 వేల ధాన్యం బస్తా కొనవలసివచ్చి ధూళీదూగరా పుష్కలంగావున్న దానిని సిసలైన ధాన్యమని 'సర్టిఫై' చేసారు. అదీ కథ. పక్కున నవ్వింది.

"ఇందులో మానాన్న చేసిన అన్యాయమేమున్నది? మీనాన్న లంచగొండి. అంచాత మా నాన్న వొదిలించుకున్నాడు అయిదువందల ముదుపు"

"అదికాదు. మానాన్న మీనాన్న తలగొట్టి అయిదువందలు కాజేసాడు. మీ నాన్న ప్రజలందరి తలా కొట్టి యాభైవేలు ఆర్జించుకున్నారు. అదీ సారాంశం.

"ఏమో నాకు తెలియదు."

లంచం పుచ్చుకోవడమెంత తప్పో, లంచమివ్వడమూ అంతటి తప్పు అన్న నీతి సూత్రం దాకా ఎదగలేదింకా బి.యస్.సి. చదువుతున్న కుమారి మణిమేఖల పదునైన మేధస్సు.

"తెలియదంటారు. చెబితే నమ్మరు! అట్లాగుండాలి" అంటూనే రైలు దిగుతున్నాడు

యువకుడు. రైలాగింది. విడిపోతూనే, చెవిలో ఊదినంత సున్నితంగా "ఏమీ అనుకోకండేం మిస్ మణిమేఖలా మీ మా కుటుంబ గౌరవ సంప్రదాయాలు ఎట్లా ఒక్క టాకీని నడుస్తున్నాయో మీకు చీల్చి చూపాలని నా ఆశయం అంతే." అని గిరుక్కున వెళ్లిపోతున్నాడతను. అతను దిగాలిసిన స్టేషనదే. లోపల చారల బనియన్ - గేబర్డిన్ సూట్ బలిష్టమైన విగ్రహం - లంచాలు గుంజి పేర్చుకున్న ఆస్తిమీద పెరిగిన కండలయినా మిసమిసలు పోతూనే వున్నాయి - అతని వంక అలవోకగా చూస్తూనే ఎన్నడూ లేనిది ఒక్కసారి చలించింది మణికుమారి.

రైలెక్కి తల్లిదండ్రుల మధ్య మహా కోపంగా కూచుంది మణి. జరిగిన విషయం పూసగుచ్చినట్టు చెప్పగానే రభస జరిగింది. "ఆ గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరా ఈయన? అని కొయ్యబారిపోయారు రాఘవయ్యగారు. ఏమో వెధవగోల - ఎంతమంది కివ్వలేదూ అని పైకనేసాడు. ఈయన ఉద్యోగం ఊడుతుందని కలగన్నాడా? రాజ్యలక్ష్మమ్మ సరేసరి. తన రోజుల్లో ఇట్లాంటి రాద్ధాంతాలెరుగదు. ఆడపిల్లలకి చదువుచెప్పిస్తే ఇదే రగడ. ఎవరైనా పిల్లవాడి అందం చూస్తారు, ఆస్తిపాస్తులు చూస్తారు, కుటుంబ సంప్రదాయమూ గట్టా.

'సంప్రదాయమూ చట్టుబండలూనూ, ఒక్క ఉరుమురిమింది మణి.

కాని ఏలూరు స్టేషన్ వచ్చేసరికి, సంభాషణ అతి సౌమ్య ధోరణిలోకి మలుపు తిరిగి, కుర్రవాడు అతిరూపసీ, మంచి చురుకుతనం కలవాడూ, అన్న పేచీలేని, నిఖార్సయిన సత్యంమీద కుమారి మణిమేఖల మౌనాంగీకారం ముద్ర వేసుకుని కూర్చుండిపోయింది.